సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం। 2। మార్చి। 2024



చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 56 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.12
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, నరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
37.4°/14.6°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కాగా.. రాత్రిళ్లు స్వల్పంగా తగ్గాయి. వేకువజామున చలి వాతావరణం కనిపించింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

విద్యార్థికి 'దీవెన'

- జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- జిల్లాలో 34,169 మంది విద్యార్థులకు లబ్ధి
- తల్లుల ఖాతాల్లో రూ.23.84 కోట్లు జమ
- మెగాచెక్కు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థుల మోము వెలిగిపోయింది. విద్యాదీవెన మొత్తం ఖాతాల్లో జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఆనందం రెట్టింపయ్యింది. ఉన్నత చదువులకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ దక్కడంతో వారి సంతోషాలకు అవధుల్లేకుండా పోయాయి. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రులో జరిగిన సభలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి 'జగనన్న విద్యా దీవెన' నిధులను విద్యార్థులు, తల్లుల ఉమ్మడి ఖాతాల్లో నేరుగా జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అర్హులైన విద్యార్థులకు విద్యా దీవెన నిధులకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వం ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు విద్యాదీవెన పథకంతో అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా (అక్టోబరు-డిసెంబరు2023) త్రైమాసికానికి సంబంధించి జిల్లాలో పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్న 34,169 మంది విద్యార్థులు, వారి తల్లులుల ఉమ్మడి ఖాతాలకు రూ.23.84 కోట్లు నగదును జమ చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు వెల్లడించారు. ఇందులో 4,616 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.2.88 కోట్లు, 2,006 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.1.43 కోట్లు, 18,227 మంది బీసీ విద్యార్థులకు రూ.12.5 కోట్లు, 3,234 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.2.99 కోట్లు, ముస్లిం మైనార్టీకి చెందిన 3,196 మందికి రూ.1.9 కోట్లు, 2,864 మంది కాపు విద్యార్థులకు రూ.2.12 కోట్లు, 26 మంది క్రిస్టియన్ విద్యార్థులకు రూ.0.02 కోట్ల పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించిందన్నారు. ఈ మొత్తాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశామన్నారు.

ఐదు విడతలుగా అందజేసిన విద్యాదీవెన మొత్తం ఇలా...

విడత	విద్యార్థులు	మొత్తం (రూ.కోట్లలో)
మొదటి విడత	36,391	22.85
రెండో విడత	31,675	25.33
మూడో విడత	35,044	23.79
నాలుగో విడత	29,491	20.07
ఐదో విడత	34,169	23.84

అండాదండా జగనన్నే



నిరుపేద కుటుంబాల్లోని మాలాంటి విద్యార్థులకు విద్యా దీవెన అండగా నిలుస్తోంది. సీఎం వైఎస్ జగనన్న రుణం తీర్చుకోలేనిది. నాకు విద్యా దీవెన, వసతి దీవెన అందుతోంది. అంతేకాకుండా మా కుటుంబంలోని వారికి వృద్ధాప్య పింఛన్, ఆసరా అందుతున్నాయి. ఇటీవలే 'నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు' పథకంలో ఇంటి నిర్మాణం చేపట్టాం. మా కుటుంబానికి అండా దండ అన్నీ జగనన్నే.

– యాస్మిన్, డిప్లొమా, బుక్కపట్నం

మా భవితకు బంగారు బాటలు



మాలాంటి పేద పిల్లల ఉన్నత విద్యకు సీఎం వైఎస్ జగన్ బంగారు బాటలు వేస్తున్నారు. మమ్మల్ని ఆదర్శంగా తీసుకొని మరికొంతమంది ఉన్నత చదువుల బాట పడతారు. ఇలాంటి సీఎం జీవితాంతం ఉండాలి. మా కుటుంబానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి కలుగుతోంది.

– షాజియా, కాగానిపల్లి, గోరంట్ల మండలం

'దీవెన'తో అద్భుత ఫలితాలు



విద్యాదీవెన, వసతి దీవెన పథకాల వల్ల అద్భుత ఫలితాలు వస్తున్నాయి. నా లాంటి నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థుల ఉన్నత చదువులకు ఇబ్బందులు లేకుండా పోయాయి. నేను గతంలో 'అమ్మ ఒడి' తీసుకున్నా. ప్రస్తుతం విద్యాదీవెన ద్వారా చదువుకుంటున్నా. ప్రతి విద్యార్థికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– గౌతమి, కొట్లపల్లి, పుట్టపర్తి మండలం

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

- 30 వేల క్లెయిమ్‌లు పరిష్కరించాం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపిన కలెక్టర్


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జేసీ ,అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాల్లో భద్రత, మౌలిక వసతులు, వెబ్‌క్యాస్టింగ్, పార్టీల నాయకులతో సమావేశాలు, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు తదితర అంశాలపై శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన క్లెయిమ్‌లలో 30 వేలు దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. ఎపిక్ కార్డులను ఓటర్లకు పోస్టల్ ద్వారా పంపుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తయ్యిందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు శిక్షణ పూర్తి చేశామన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ మాధవరెడ్డి


ధర్మవరంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల వేళ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన సీకే పల్లి, కుంటిమద్ది, పోలేపల్లి, ననసకోట, భానుకోట, నాగసముద్రం, కనగానిపల్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ జరిగే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులుతో పాటు సిబ్బంది ఉన్నారు.

సమష్టిగా పనిచేయాలి..

రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది సమష్టిగా పనిచేయాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ) సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల వేళ డీపీఓ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమష్టిగా విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే పోలీసులకు డీఏ బడ్జెట్, ఇతర అలవెన్సులు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి శాఖాపరమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీపీఓ ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

యువత ఓటెత్తాలి


ఓటు ఎలా వేయాలో తెలియజేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: దేశ భవిష్యత్‌ను మార్చే ఎన్నికల్లో యువత కీలకంగా వ్యవహరించాలని, వందశాతం ఓటింగ్‌కు కృషి చేయాలని 'స్వీప్' జిల్లా నోడల్ ఆఫీసర్ శివరంగప్రసాద్ అన్నారు. ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమీపంలోని మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద తొలిసారి ఓటు హక్కు పొందిన యువతకు ఓటు వినియోగం, ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ, 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ సుపరిపాలన అందించే నాయకులను ఎన్నుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యాసంస్థల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


ఏపీఆర్ఎస్, ఏపీఆర్‌జేసీ సెట్ల పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈఓ మీనాక్షి

పుట్టపర్తి: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో (2024-25 విద్యా సంవత్సరానికి) 5, 6, 7, 8వ తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు https:// aprs. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అనంతరం ఏపీఆర్ఎస్, ఏపీఆర్‌జేసీ సెట్ల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీ నాగరాజు, సూపరింటెండెంట్ పురోషోత్తం ప్రసాద్, సీఎంఓ అబ్దుల్ మాలిక్, కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మురళిధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


అగళి సెంటర్‌లో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంఆర్‌ఓ వెంకటేశ్వర్లు

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సర విద్యార్థులకు పరీక్ష జరిగింది. 41 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు జనరల్ విద్యార్థులు 10,348 మందికి గాను 10,072 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,454 మందికి గానూ 1,367 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం రెండో సంవత్సర విద్యార్థులకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

పెన్‌స్టేట్ వర్సిటీతో జేఎన్‌టీయూ సంప్రదింపులు


పెన్ స్టేట్ వర్సిటీ ప్రతినిధి డాక్టర్ హమీద్ అన్సార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ

అనంతపురం: పెన్‌స్టేట్ యూనివర్సిటీ (యూఎస్ఏ)తో జేఎన్‌టీయూ అనంతపురం అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి సంప్రదింపులు జరుగుతున్నాయి. ఈ మేరకు జేఎన్‌టీయూలో రెండు యూనివర్సిటీల ఉన్నతాధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. జేఎన్‌టీయూ(ఏ) వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డిగ్రీ ప్రోగ్రాం, పరిశోధన సహకారం, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ వంటి అంశాలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో పెన్‌స్టేట్ వర్సిటీ ప్రతినిధులు డాక్టర్ హమీద్ అన్సార్, డాక్టర్ వెంకటరామన్, డాక్టర్ సాయిరామ్, డాక్టర్ టాడ్‌క్లార్క్, టీవీ రెడ్డి, జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే సంక్షేమం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

- మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి (పరిగి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ నియోజవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం ఆమె పరిగిలో పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికార వ్యామోహంతో వస్తున్న టీడీపీ, జనసేనకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నవరత్నాలు పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే జగనన్నను మరో మారు సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశానని గొప్పగా చెప్పుకునే చంద్రబాబు కేవలం తన స్వార్థ రాజకీయాల కోసమే పాటు పడ్డారన్నారు. రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నాయని, అందువల్లే పేదలంతా వైఎస్సార్ సీపీ జెండా ఎత్తుకున్నారన్నారు. ఇక ఎన్ని కూటములు ఏకమైనా జగనన్నకు ఎదురు నిలువలేవన్నారు. తప్పకుండా 175 స్థానాల్లో విజయఢంకా మోగిస్తామన్నారు. ఇందుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, పార్టీ తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, జెడ్పీటీసీ శ్రీరామప్ప, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సర్పంచ్ లక్ష్మీదేవి, సింగిల్ విండో మాజీ చైర్మన్ మారుతి రెడ్డి, మాజీ కన్వీనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- రేపు పల్స్ పోలియో
- జిల్లాలో 1,915 బూత్‌ల ఏర్పాటు

ప్రశాంతి నిలయం: పోలియోను సమూలంగా నిర్మూలించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ఈనెల 3 నుంచి పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతోంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల్లోపు 2,70,659 మంది పిల్లలున్నట్లు గుర్తించారు. వీరందరికీ టీకా అందించేందుకు 11,866 వైల్స్‌ను సిద్ధం చేశారు. తొలిరోజు ఆదివారం జిల్లాలో ఏర్పాటు చేసిన 1,915 బూత్‌లలో పోలియో చుక్కల మందు అందిస్తారన్నారు. సోమ, మంగళ వారాల్లో (4, 5 తేదీల్లో) ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటా సర్వే చేపట్టి పోలియో చుక్కలు వేసుకోని వారికి టీకా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే పల్స్ పోలియో కార్యక్రమం కోసం 50 మంది మెడికల్ ఆఫీసర్లు, 193 మంది సూపర్ వైజర్లు, 1,500 మంది అశావర్కర్లు, 2,451 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 540 ఏఎన్ఎంలు, 354 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 1,487 మంది వలంటీర్లను నియమించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే కూడళ్లలో సైతం పోలియో చుక్కలు వేసేందుకు 62 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఆనందమని పింఛన్


అమడగూరు మండలం మహమ్మదాబాద్‌లో వితంతువుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బాబా

పుట్టపర్తి అర్బన్: తెల్లవారుజామునే వలంటీర్ తలుపుతట్టి 'పింఛన్ కానుక' అందించడంతో లబ్ధిదారులు ఆనందంలో మునిగిపోయారు. ఉద్యోగులకు వేతనం ఇచ్చినట్లు ఏ ఆసరాలేని తమలాంటి వారికి ఠంచనుగా పింఛన్ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో 2,73,627 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.81,67,37,500 మంజూరు చేసింది. దీంతో గురువారం సాయంత్రమే నిధులు డ్రా చేసుకున్న వలంటీర్లు శుక్రవారం తెల్లవారుజామునుంచే పింఛన్ పంపిణీ ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ 2,11,793 మందికి రూ.63,17,04,000 పింఛన్ మొత్తం పంపిణీ చేశారు. దీంతో తొలిరోజే 78 శాతం పింఛన్ పంపిణీ పూర్తయ్యింది. పింఛన్ పంపిణీకి మరో నాలుగు రోజులు గడువు ఉందని, తప్పక 100 శాతం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఓ పీడీ నరసయ్య తెలిపారు.

చంద్రబాబుపై తమ్ముళ్ల తిరుగుబాటు


మడకశిరలో బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు


పెనుకొండలో బీకే పార్థసారథి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన తర్వాత టీడీపీలో రేగిన అసంతృప్తి జ్వాలలు చల్లారడం లేదు. మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. చంద్రబాబు అభ్యర్థులను మార్చకపోతే ఓటమి తప్పదని తెలుగు తమ్ముళ్లు హెచ్చరికలు జారీ చేశారు.

- అసెంబ్లీ టికెట్ల కేటాయింపుపై ఆగ్రహం
- పెనుకొండ, మడకశిరలో కొనసాగుతున్న నిరసనలు
- అభ్యర్థులను మార్చకపోతే ఓటమి తప్పదని వెల్లడి

మడకశిర: మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్‌ను మడకశిర టీడీపీ అభ్యర్థిగా ప్రకటించగా, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అభ్యర్థిగా ప్రకటించిన రోజే మద్దతు కోసం 'గుండుమల'ను కలిసేందుకు వచ్చిన ఈరన్న, సునీల్‌పై చెప్పులదాడి జరిగింది. తాజాగా శుక్రవారం కూడా నియోజకవర్గంలోని టీడీపీకి చెందిన యూనిట్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. మడకశిరలోని పార్టీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. చంద్రబాబు మడకశిర టీడీపీ టికెట్‌పై పునరాలోచన చేయాలని, సునీల్‌కుమార్‌ను మార్చాలని నినాదాలు చేశారు. లేకపోతే పార్టీకి గుడ్‌బై చెబుతామని హెచ్చరించారు. సునీల్‌కుమార్‌నే అభ్యర్థిగా కొనసాగిస్తే పార్టీ ఓడిపోవడం ఖాయమన్నారు.

పెనుకొండ: టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథిని కాదని పెనుకొండ టీడీపీ అభ్యర్థిగా సవితను ప్రకటించడంపై తెలుగు తమ్ముళ్లు భగ్గుమంటున్నారు. అభ్యర్థిని మార్చాలంటూ బీకే ఇంటి వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం కూడా బీకే సతీమణి కమలమ్మతో కలిసి పలువురు నేతలు ఆందోళనకు దిగారు. బీకేకు టికెట్ ఇవ్వకపోతే పెనుకొండలో టీడీపీ ఓటమి తప్పదన్నారు. ఎమ్మెల్యేగా బరిలో నిలిచేంత శక్తి సవితమ్మకు లేదని, చంద్రబాబు తన నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత విజయవాడలో మకాం వేసిన బీకే పార్థసారథి తనకు టికెట్ ఇవ్వాలంటూ చంద్రబాబు, లోకేష్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిరసన కార్యక్రమంలో టీడీపీలోని బీకే వర్గం ముఖ్య నాయకులు జీవీపీ నాయుడు, రొద్దం జెడ్పీటీసీ చిన్నప్పయ్య, మాజీ ఎంపీపీ భర్త కేశవయ్య, సంజీవరెడ్డి, బెల్లాల చెరువు చంద్ర, నరహరి, వీజీపాళ్యం తదితరులు ఉన్నారు.

పారిశ్రామిక ప్రగతికి చర్యలు

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు విరివిగా రుణాలు
- ఎంఎస్ఎంఈల సర్వేకు సహకరించాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. అర్హులైన, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు విరివిగా రుణాలివ్వాల, రుణ మంజూరులో అలసత్వం వహించరాదని బ్యాంకర్లకు సూచించారు. ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) పార్కులకు సంబంధించిన సమాచారాన్ని సర్వే అండ్ సపోర్ట్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో యూనిట్ల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా విశ్వకర్మ లబ్ధిదారుల ఆన్‌లైన్ జాబితాను మూడు రోజుల్లోపు తనకు సమర్పించాలన్నారు. ఇప్పటికే స్థాపించిన పరిశ్రమల పనితీరును పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ర్యాంప్' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీన్ని పరిశ్రమల శాఖ ద్వారా అమలు చేయడానికి జీఓ జారీ చేసిందన్నారు. ఈనెల 20వ తేదీలోపు ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్ ప్రక్రియలో భాగంగా సర్వే చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు సెక్రెటరీలు సర్వే అండ్ సపోర్ట్ యాప్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్యరంగాల్లోని ఎంఎస్ఎంఈలను డిజిటల్ ప్లాట్ ఫారంలోకి తీసుకొచ్చి ఏపీఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేయాలన్నారు. తద్వారా వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందడం, బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు మరింత సులువు అవుతుందన్నారు. అనంతరం ఎంఎస్ఎంఈల సర్వే అండ్ సపోర్ట్‌కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ చాంద్‌బాషా, జిల్లా ఫైర్ అధికారి శంకరరెడ్డి, పరిశ్రమల శాఖ డీడీ మహబూబ్ బాషా, ఏపీఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ మహేష్, కాలుష్య నియంత్రణ శాఖ అధికారి కిశోర్, డిక్కీ జోనల్ ప్రెసిడెంట్ కోలా వెంకటరమణ, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల్లో సెంట్రల్ ఫోర్స్ విభాగం కీలకం



పెనుకొండలోని ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో సెంట్రల్ ఫోర్స్ విభాగం చాలా కీలకంగా మారనుందని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది విడిది చేసే పెనుకొండలోని ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. మౌలిక వసతులపై స్థానిక సిబ్బందితో ఆరా తీశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చే కేంద్ర బలగాలకు ఆశ్రయం కల్పించి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పెనుకొండ డీఎస్పీ బాబ్జాన్ సైదు, సీఐ యుగంధర్, ఎస్ఐ రాజేష్ ఉన్నారు.

ముగిసిన రాతి దూలం లాగుడు పోటీలు



దూలం లాగుతున్న వృషభాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు శుక్రవారం ముగిసాయి. ఆరు, ఆరు పళ్ల, న్యూ కేటగిరి, సీనియర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో కర్నూలు, వైఎస్సార్, నంద్యాల జిల్లాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. పోటీలు ముగిసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, పురుషోత్తం యాదవ్ నగదు పురస్కారాలను అందజేశారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాణిక్య రంగనాథస్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, కౌన్సిలర్లు వరదరాజులు, నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బేడల వెంకట్రాముడు, రంగస్వామి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, షఫీ, రామరంగారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఇబ్రహీం, నరసింహులు, ప్రభాకర్, బలరాముడు, పెద్దనారాయణ పాల్గొన్నారు.

ఊపిరి నిలిపిన ప్రభుత్వం



అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

పునర్జన్మ ప్రసాదించారు



- ఈ వ్యక్తి పేరు మహమ్మద్ రఫి. అనంతపురం పాతూరులో గ్యాస్ షాపు నిర్వహిస్తున్నాడు. 2020 ప్రారంభంలోనే కోవిడ్ బారినపడ్డాడు. అప్పట్లో ప్రభుత్వం అనంతపురం సర్వజనాస్పత్రి, హిందూపురం జిల్లా ఆస్పత్రి, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి, కిమ్స్ సవీరతో పాటు మరికొన్ని ఆస్పత్రుల్లో కోవిడ్ రోగులకు ఉచితంగా సేవలందించే ఏర్పాట్లు చేసింది. మహమ్మద్ రఫి ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా కిమ్స్ సవీరలో 14 రోజుల పాటు సేవలు పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. విపత్తు సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఎప్పటికీ మర్చిపోలేమని మహమ్మద్ రఫి చెబుతున్నారు.

పాపకు ప్రాణభిక్ష పెట్టారు



- ఇక్కడ కనిపిస్తున్న దంపతులు బషీర్, షకీల. బషీర్ అనంతపురంలో అరటి పండ్ల వ్యాపారి. వీరికి మూడేళ్ల కుమార్తె ఫరీహ ఉంది. కోవిడ్ ప్రారంభ దశలో ఇంట్లో అందరూ జ్వరాల బారిన పడ్డారు. చిన్నారి ఫరీహకు కోవిడ్ నిర్ధారణ అయ్యింది. దీంతో తల్లీబిడ్డను అధికార యంత్రాంగం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించింది. కోవిడ్ అనగానే మొదట్లో భయమేసిందని, ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కుటుంబ సభ్యుల్లా చూసుకుని సేవలందించారని బషీర్, షకీల దంపతులు తెలిపారు. పాప ప్రాణాలు నిలబడ్డాయంటే అది ప్రభుత్వం మంచి ఆస్పత్రిలో సేవలందించేలా చర్యలు తీసుకోవడం వల్లేనని చెబుతున్నారు.



కోవిడ్ నిర్ధారణ పరీక్షల్లో భాగంగా నమూనాలు సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

- కోవిడ్ విపత్తు వేళ.. ఆపన్న హస్తం
- సత్ఫలితాలిచ్చిన జగన్ సర్కారు చర్యలు
- మూడు దశల్లో జిల్లాలో 25 లక్షల మందికి సేవలు

అనంతపురం మెడికల్: ప్రపంచాన్ని వణికించిన మహమ్మారి కోవిడ్. నీరసం, జ్వరం, జలుబు, దగ్గు తదితర లక్షణాలతో మొదలై ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందిని పొట్టన పెట్టుకుంది. అంతటి భయంకరమైన విపత్తును ఎదుర్కోవడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖలతో పాటు సచివాలయ -వలంటీర్ వ్యవస్థ సహకారం తీసుకుని అనుమానాస్పద లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ వేగవంతంగా నిర్ధారణ పరీక్షలు చేయడం.. పాజిటివ్ వచ్చిన వారిని ప్రత్యేకంగా ఆస్పత్రులు, కోవిడ్ కేర్ సెంటర్లు, హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్య సేవలందించి కోలుకునేలా చేశారు. అవసరమైన చోట్ల ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసి తద్వారా రోగులకు ప్రాణవాయువు అందించారు. అంతేకాదు కోవిడ్ వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం లాక్‌డౌన్ విధించిన సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు కోవిడ్ వ్యాక్సినేషన్‌ను వేగవంతంగా పూర్తిచేయడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. కోవిడ్ మూడు దశల్లో జిల్లాలో దాదాపు 25 లక్షల మందికి ప్రభుత్వం సేవలందించిందంటే ఏ స్థాయిలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందో చెప్పాల్సిన పనిలేదు.

కోవిడ్ నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లాలో 2020 మార్చి నుంచి కోవిడ్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఆరోగ్య, మునిసిపాలిటీ, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం కోవిడ్ బాధితులకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంది. మూడు దశల్లో 25,47,582 మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా, అందులో 1,77,596 మందికి కోవిడ్ నిర్ధారణ అయ్యింది. 45,327 మంది ఆస్పత్రిలో, 64,200 మంది కోవిడ్ కేర్ సెంటర్లలో, 66,331 మంది హోం ఐసోలేషన్‌లో సేవలు పొందారు.

వారి సేవలు అమూల్యమైనవి

కోవిడ్ సమయంలో ఆరోగ్య, పోలీసు శాఖలు అత్యంత కీలకంగా వ్యవహరించాయి. వైరస్ వ్యాప్తి చెందకుండా మునిసిపల్, పంచాయతీ సిబ్బంది కోవిడ్ ప్రభావిత ప్రాంతాల్లో అహర్నిశలు శ్రమించారు. బాధితులకు వలంటీర్లు ఆప్తుల్లా సపర్యలు చేశారు. ప్రధానంగా అనంతపురం సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ, హిందూపురం ఆస్పత్రి, తదితర ఆస్పత్రుల్లో రోగులను వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓతో పాటు పారిశుధ్య కార్మికులు సైతం కంటిరెప్పలా చూసుకున్నారు. లాక్‌డౌన్‌ను పక్కాగా అమలు చేయడంలో 4వేల మందికిపైగా పోలీసు సిబ్బంది సేవలందించారు.

జిల్లాలో కోవిడ్ మొదలైంది	2020 మార్చి
కోవిడ్ మొదటి వేవ్	2020 మార్చి నుంచి 2021 ఫిబ్రవరి
రెండో వేవ్	2021 మార్చి నుంచి 2021 నవంబర్
మూడో వేవ్	2021 డిసెంబర్ నుంచి 2022 ఏప్రిల్
సేవలు పొందిన వారి సంఖ్య	25,47,582
పాజిటివ్ కేసులు	1,77,596
ఆస్పత్రిలో అడ్మిషన్ పొందిన వారి సంఖ్య	45,327
కోవిడ్ కేర్ సెంటర్లలో	64,200
హోం ఐసోలేషన్	66,331
మరణాలు	1,142

కోవిడ్ సమయంలో 'సూపర్' సేవలు



రెండో వేవ్‌లో కరోనా బారిన పడ్డా. ఆ సమయంలో కరోనా నిర్ధారణ కావడంతో అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యా. అక్కడ వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది మంచి సేవలందించారు. అధైర్య పడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. వారం రోజులకు పైగా అక్కడే మెరుగైన సేవలందించారు. ప్రైవేట్‌గా అటువంటి సేవలు పొందాలంటే చాలా ఖర్చు అయ్యేది. ప్రభుత్వం ఉచితంగా సేవలంచినందుకు ధన్యవాదాలు.

–గౌసియా, అనంతపురం

ప్రభుత్వ సేవలు మరువలేనివి



కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. ఆ సమయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మాలాంటి వారికి బాగా ఉపయోగపడింది. వలంటీర్లు ఎప్పటికప్పుడు వచ్చి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసేవారు. ఏమైనా జ్వరం వస్తే మందులు, తదితర వాటిని ఇంటి వద్దకే తెచ్చేవారు. మరీ ముఖ్యంగా మునిసిపల్ కార్మికులు మా వీధిలోని పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేవారు. కరోనా సమయంలో ప్రభుత్వ సేవలు మరువలేనివి.

– లక్ష్మీప్రసన్న, గృహిణి, అనంతపురం

ప్రతి లబ్ధిదారుకూ నిత్యావసరాలు అందించాలి



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి

బత్తలపల్లి: బియ్యం కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న నిత్యావసర సరుకులు అందించాలని ఎండీయూ ఆపరేటర్లను డీఎస్ఓ పీజీ వంశీకృష్ణారెడ్డి ఆదేశించారు. బత్తలపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం ఎండీయూ వాహనం ద్వారా చేపట్టిన నిత్యావసర సరుకులు పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. రాగి పిండి నాణ్యతను తనిఖీ చేశారు. సరుకుల పంపిణీపై లబ్ధిదారులతో ఆరా తీశారు. రాగుల్లోని పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రాగి పిండిని పంపిణీ చేస్తోందన్నారు. ఆయన వెంట సీఎస్‌డీటీ శారద ఉన్నారు.

చెరువు కట్ట వద్ద వ్యక్తి మృతదేహం



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దాదాపు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి శరీరంపై తెల్లని చొక్క ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు బుక్కరాయసముద్రం పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సీఐ కోరారు.

జార్ఖండ్‌లో అదృశ్యం... 'అనంత'లో ప్రత్యక్షం

- జీఆర్పీ, చైల్డ్‌లైన్ సిబ్బంది చొరవతో కుటుంబసభ్యులకు బాలుడి అప్పగింత



దారి తప్పొచ్చిన బాలుడు, కుటుంబసభ్యులతో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తదితరులు

అనంతపురం సిటీ: తప్పిపోయిన బాలుడు 16 రోజుల తర్వాత మళ్లీ తమ చెంతకు చేరడంతో ఆ కుటంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. వివరాలు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఖాదీరాం గోసే వయస్సు 17 ఏళ్లు. పుట్టుకతోనే మూగ, చెవిటి అయినా పదో తరగతి పూర్తి చేశాడు. గత నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ బాలుడు తప్పిపోయాడు. రైలెక్కి ధర్మవరానికి చేరుకున్నాడు. ఒంటిరిగా ఉన్న బాలుడిని టీటీ చూసి సమాచారం అందించడంతో జీఆర్పీ పోలీసులు ఆధీనంలోకి తీసుకుని చైల్డ్‌లైన్-1098 డీసీపీఓ మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళికి అప్పగించారు. వారు అనంతపురానికి పిలుచుకొచ్చి చైల్డ్‌లైన్ జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి, చైల్డ్‌లైన్ టీం ఇర్ఫాన్, నిర్మల, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవి నేతృత్వంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ మేడా రామలక్ష్మి ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలో ఆమె చొరవ తీసుకొని బాలుడికి బుక్కరాయసముద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో వసతి కల్పించారు. అక్కడి ఉపాధ్యాయుల ద్వారా బాలుడి వివరాలు రాబట్టి, జార్ఖండ్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఖాదీరాం గోసే అన్న జగన్నాథ్ గోసే, మేనమామ బృందావన్ గోల శుక్రవారం అనంతపురానికి వచ్చి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి సమక్షంలో బాలుడిని అక్కున చేర్చుకున్నారు. తమ బిడ్డను చేరదీసి, సురక్షితంగా అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సీడబ్ల్యూసీ సభ్యురాలు కామేశ్వరి, చైల్డ్‌లైన్ బృందం ఇర్ఫాన్, నిర్మల పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏకు న్యాక్ 'ఏ'



విలేకరులతో మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ వీసీ శ్రీనివాసరావు

- దరఖాస్తు చేసిన తొలిదఫానే గణనీయమైన గ్రేడింగ్
- 2029 వరకు న్యాక్ ఏ గ్రేడ్ వర్తించేలా ఉత్తర్వులు జారీ

అనంతపురం: సాంకేతిక విద్యలో రాయలసీమలోనే కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ అనంతపురం సిగలో మరో కలికితురాయి చేరింది. ప్రతిష్టాత్మక న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్)–ఏ గ్రేడ్ సాధించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు అందాయి. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం కళాశాలను 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి యూనివర్సిటీగా మార్పు చేశారు. అప్పటి నుంచి జేఎన్‌టీయూ(ఏ) అంచలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ సాంకేతిక యూనివర్సిటీగా నిలిచింది. న్యాక్‌కు దరఖాస్తు చేసిన తొలి ప్రయత్నంలోనే ఏ గ్రేడ్ దక్కించుకుంది. దీంతో యూనివర్సిటీ ఉన్నతాధికారులు, విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. 2029 ఫిబ్రవరి 28 వరకు న్యాక్ –ఏ గ్రేడ్ గుర్తింపు వర్తిస్తుంది.

చాలా ఆనందంగా ఉంది..

జేఎన్‌టీయూ అనంతపురం న్యాక్ –ఏ గ్రేడ్ సాధించడం చాలా ఆనందంగా ఉందని వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వీసీ కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. న్యాక్ గ్రేడింగ్‌తోనే వర్సిటీకి పరిశోధన ప్రాజెక్టులు రావడానికి వీలు కలుగుతుందన్నారు. అతి తక్కువ పాయింట్లలోనే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రాలేదని భావిస్తున్నామన్నారు. లోటుపాట్లను అధిగమించి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడానికి కృషి చేస్తామన్నారు. సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్‌ను రూపకల్పన చేసిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ న్యాక్ గ్రేడింగ్ రావడానికి విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. యూనివర్సిటీ పురోగతికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి, ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ శోభాబిందు, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రేడ్‌కు దోహదం చేసిందివే..

న్యాక్– ఏ గ్రేడ్ రావడానికి గల కారణాలను న్యాక్ పీర్ కమిటీ అధికారికంగా వెల్లడించింది. ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీ కావడం, సింహభాగం పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడం ప్రధానమైన అంశంగా గుర్తించారు. భవిష్యత్తులో మరిన్ని విభాగాలు అభివృద్ధి చెందడానికి జేఎన్‌టీయూ(ఏ)కు కావాల్సినంత స్థలం అందుబాటులో ఉంది. మెట్రో నగరాలు అయిన హైదరాబాద్, బెంగళూరుకు యూనివర్సిటీ కనెక్టివిటీ ఉండడం.

- గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అవసరాలకు దీటుగా విద్యా ప్రణాళిక రూపకల్పన చేశారు. కోర్సు పూర్తయితే తక్షణ ఉపాధి కల్పించే రీతిలో ప్రోగ్రామ్స్ ప్రవేశపెట్టారు. అకడమిక్ పురోగతి సాధించే దిశగా విద్యా ప్రణాళికలో అంశాలు చేర్చారు. వీటితో పాటు మానవ విలువలు, నైతిక అంశాలు, పర్యావరణ సమతుల్యత తదితర అంశాలను విద్యాప్రణాళికలో భాగంగా మార్పు చేశారు.
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రూ.100 కోట్లు వెచ్చించి యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన చేపట్టారు.
- 2008లో ఏర్పడినప్పటికీ అతి తక్కువ కాలంలోనే 134 అనుబంధ కళాశాలలు, 5 కానిస్టిట్యూట్ కళాశాలలతో (క్యాంపస్ కళాశాల, ఓటీపీఆర్ఐ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, పులివెందుల, కలికిరి కళాశాలలు) నాణ్యమైన విద్యను పెంపొందిస్తోంది. ఇంజినీరింగ్, సైన్సెస్, హ్యూమానిటీస్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్కిల్ ఓరియంటెడ్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ సిస్టమ్స్ (మూక్స్), స్వయం ప్రోగ్రామ్‌ల ద్వారా ఆన్‌లైన్ విద్యను ఉచితంగా అందిస్తున్నారు.

సూరప్పకుంటలో చేపల మృత్యువాత



చనిపోయిన చేపలను వెలికి తీయిస్తున్న దృశ్యం

హిందూపురం: స్థానిక సూరప్ప కుంటలో నీరు కలుషితమై అందులోని చేపలన్నీ చనిపోయాయి. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి సమాచారం అందించడంతో కౌన్సిలర్లు షాజియా, నాగేంద్రమ్మ, డాక్టర్ బాషా, మున్సిపల్ కమిషనర్ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నీటిలో కుప్పగా తేలియాడుతున్న చేపలను జేసీబీ సాయంతో వెలికి తీయించారు. నీటి కాలుష్యం వల్లనే చేపలు చనిపోయినట్లుగా అనుమానాలు వ్యక్తం కావడంతో నీటి నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపారు. ఇతరులెవరూ చెరువు వద్దకు వెళ్లకుండా హెచ్చరిస్తూ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

జిల్లా పంచాయతీ అధికారికి సన్మానం



డీపీఓ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులు

పుట్టపర్తి అర్బన్: 'ఒక పంచాయతీ–ఒక కార్యదర్శి'ని నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌ను జిల్లాలోని కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం డీపీఓను ఆయన కార్యాలయంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు కలసి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో జిల్లాలో సుమారు 211 మంది గ్రేడ్-5 కార్యదర్శులకు గాను 168 మందికి డీడీఓ హోదా దక్కుతుందన్నారు. దీంతో సంతకాల అధికారం, చెక్ పవర్, ట్యాక్స్ కలెక్షన్, ట్యాక్స్ వేయడం, సమావేశాలు నిర్వహించడం తదితర అధికారాలను కలిగి ఉంటాయన్నారు. ఈ సదవకాశాన్ని కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

కనగానపల్లి: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం దాదులూరు కొట్టాలకు చెందిన చంద్రశేఖరరెడ్డి (35) శుక్రవారం తెల్లవారుజామున తన పొలానికి నడుచుకుంటూ బయలుదేరాడు. 44వ జాతీయ రహదారిని దాటుకుని అవతలి వైపు వెళుతుండగా అనంతపురం నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వనిత, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు చంద్రశేఖరరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

మంటల్లో లారీ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న లారీ

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం మంటలు చెలరేగి ఓ లారీ దగ్ధమైంది. లారీ డ్రైవర్ నారాయణస్వామి మాట్లాడుతూ... ధర్మవరం నుంచి జంగాలపల్లి గోదాము వద్ద ఉన్న చౌకధాన్యం తీసుకువచ్చేందుకు లారీని తీసుకెళ్లుతుండగా ఒక్కసారిగా క్యాబిన్‌లో మంటలు చెలరేగాయన్నారు. దీంతో వాహనాన్ని ఆపి కిందకు దూకేసినట్లు వివరించాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.